29 వరకు వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆల్విన్‌కాలనీ: భవ్యాస్ తులసీవనంలోని శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారి అభిషేకం, శ్రీవారి నిజపాద దర్శనం, విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, సాయంత్రం సేనాధిపతి ఉత్సవం నిర్వహించారు. 25వ తేదీ శనివారం ధ్వజపట ప్రతిష్ఠ, సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణ, తిరువీధుల యందు శేష వాహనోత్సవం, 26వ తేదీ ఆదివారం ఉదయం సర్వ భూపాల వాహనోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ, హనుమంత వాహనోత్సవం, 27వ తేదీ సోమవారం ఉదయం మోహినీ పల్లకి ఉత్సవం, అన్నకూటోత్సవం, సాయంత్రం ఊంజల్ సేవ, తిరువీధులలో శ్రీవారి గరుడ వాహనోత్సవం, 28వ తేదీ మంగళవారం ఉదయం స్వామి రథోత్సవం, సాయంత్రం శ్రీవారి కల్యాణ మహోత్సవం, ముత్యాల పందిరి, 29వ తేదీ బుధవారం ఉదయం వసంతోత్సవం, శ్రీవారి చక్రస్నానం, సాయంత్రం తిరువీధుల యందు అశ్వవాహనోత్సవం, ధ్వజావరోహణ, పూర్ణాహుతి వంటి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

వీసీ పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యం ఉండొద్దు

బాలానగర్: తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో వీసీల పోస్టులను రాజకీయాలకతీతంగా భర్తీ చేయాలని, జూన్ 2 స్వరాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం లోపు రెగ్యులర్ వీసీలను నియమించాలని ఆల్ తెలంగాణ యూనివర్సిటీస్ ఐక్య కార్యాచరణ కమిటీ రాష్ట్ర చైర్మన్, జేఎన్‌టీయుహెచ్ యూనివర్సిటీ విద్యార్థి నేత ఎరవెల్లి జగన్ శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాల వల్ల గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న వ్యక్తులకు వీసీ పోస్టులను కట్టబెట్టి యూనివర్సిటీలను భ్రష్టు పట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నియమించిన యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్‌లపై కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం విచారణ చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యున్నతమైన సాంకేతిక విశ్వవిద్యాలయమైన జేఎన్‌టీయుహెచ్‌య యూనివర్సిటీకి టెక్నికల్ బ్యాక్‌గ్రౌండ్, జేఎన్‌టీయుహెచ్ యూనివర్సిటీలో ప్రొఫెసర్స్‌గా పనిచేసిన వారినే నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకుల మార్వాడి అభిషేక్, రుద్రపాటి జాహ్నవి, వొజ్జల జ్యోత్న, భూక్య కల్పన, చంద్రశేఖర్ ఆజాద్, కోడం సంతోష్, లింగాల సాగర్, సునావత్ ప్రశాంత్, ఉదయ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు



మహేష్‌కుమార్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆయనను గజమాలతో సన్మానించి వాజిద్ బాషా

మోతీనగర్: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ వాజిద్ బాషా ఆయనను గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాజిద్ బాషా మాట్లాడుతూ మహేష్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్త నుంచి వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం ఎమ్మెల్సీగా పనిచేయటం ఎంతో గొప్ప విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందనడానికి మహేష్ కుమార్ గౌడే నిదర్శనమని తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

ఈర్ల చెరువు సుందరీకరణ పనుల పరిశీలన



ఈర్ల చెరువు పనుల గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధి ఈర్ల చెరువును రూ.7.73 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, చెరువులో మురుగునీరు కలవకుండా ప్రత్యేకంగా కాల్వ నిర్మాణం చేపడుతున్నామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఈర్ల చెరువు సుందరీకరణ పనులను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాలినగర్ నుంచి ఈర్ల చెరువులో కలుషిత నీరు కలవకుండా డ్రైనేజీ మళ్లింపు పనులను వేగవంతం చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీపడొద్దని సూచించారు. చుట్టుపక్కల కాలనీల నుంచి వచ్చే మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువు సంరక్షణలో భాగంగా చెరువు చుట్టు ఫెన్సింగ్ నిర్మాణం, అలుగు, సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువులను సుందరీకరిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వామ్మో.. హోటళ్లలో ఫుడ్డా!



జూబ్లీహిల్స్ హోటళ్లలో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్

- 'హిల్స్' హోటళ్లలో పరిశుభ్రతకు తిలోదకాలు
- గడువుతీరిన ఆహార పదార్థాలు
- బూజుపట్టిన సరుకులు
- కిచెన్‌లో ఎలుకలు, బొద్దింకల స్వైర విహారం
- పాడైన చికెన్, మటన్ గుర్తింపు
- నోటీసులు జారీ చేస్తున్న అధికారులు
- కొన్ని హోటళ్లలో ఆహార పదార్థాల సీజ్

బంజారాహిల్స్: ఆర్భాటంగా... తళుకు బెళుకుల ఇంటీరియర్‌తో ఆకట్టుకునే ఫర్నీచర్‌తో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో నాణ్యతా లోపం, అపరిశుభ్రత, గడువుతీరిన ఆహార పదార్థాలు వెలుగు చూస్తుండటంతో ఆహార ప్రియులు షాక్ అవుతున్నారు. గడిచిన నాలుగు వారాల నుంచి ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, అమీర్‌పేట, వంజగుట్ట, సోమాజిగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్ ప్రాంతాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ తనిఖీల్లో ముఖ్యంగా కిచెన్‌లలో పరిశుభ్రత పూర్తిగా లోపించిందని అధికారులు పేర్కొంటున్నారు.

- జూబ్లీహిల్స్‌లోని 16 పబ్‌లలో అధికారులు తనిఖీలు చేయగా దాదాపు అన్నింట్లోనూ నిల్వ చేసిన ఆహార పదార్థాలు గడువుతీరిన తరువాత కూడా వంటల్లో వినియోగిస్తున్నట్లు వారు నిర్ధారించారు.
- ఇక హోటళ్లలోని కిచెన్‌లలో అపరిశుభ్రత, దుర్గంధం, దుర్వాసన, ఈగలు, దోమలు, ఎలుకలు, పందికొక్కులు, బొద్దింకలు స్వైరవిహారం చేయడమే కాకుండా వంటలకు వినియోగిస్తున్న సామగ్రిపై తిరుగాడుతున్నట్లు కూడా గుర్తించారు.
- వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ పదార్థాలను ఒకే ఫ్రిడ్జ్‌లో ఒకే రాక్‌లో పెడుతుండడాన్ని కూడా అధికారులు గుర్తించారు. చాలా హోటళ్లలో కొన్ని ఆహార పదార్థాలు బూజు పట్టి కనిపించాయని దాదాపు హోటళ్లు, రెస్టారెంట్లలోని కిచెన్‌లన్నీ అపరిశుభ్రంగా కనిపించాయన్నారు..
- చాలా ఫిర్యాదుల అనంతరం ఇటీవల కాలంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆయా హోటళ్లలో తనిఖీలు చేశారు. చాలా హోటళ్లలో ఆహార పదార్థాలపై క్రిములు వాలుతున్నట్లుగా నిర్ధారణ అయ్యింది. ఇక చెత్త, వ్యర్థాలు వేసే డస్ట్‌బిన్లపై మూతలు లేవ ని, దీంతో ఈగలు, దోమలు, బొద్దింకలు స్వైరవిహారం చేస్తున్నాయని అధికారులు తెలిపారు.
- కేఎఫ్‌సీ లాంటి ఇంటర్నేషనల్ చైన్ హోటళ్లపై దాడులు చేసి ఆహార పదార్థాల నాణ్యతపై నోటీసులు జారీ చేశారు.

ఉల్లంఘించిన హోటళ్ల జాబితా..

క్రీమ్ స్టోన్, నేచురల్స్ ఐస్‌క్రీమ్, కరాచి బేకరీ, కేఎఫ్‌సీ, రోస్టీ కాఫీ హౌస్, రాయలసీమ రుచులు, షాగౌస్,కామత్ హోటల్, 36 డౌన్ టౌన్ పబ్, మకావ్ కిచెన్ అండ్ బార్ పబ్, ఎయిర్ లైవ్, టాకో బెల్, ఆహా దక్షిణ్, కిజిలింగ్ జో, ఖాన్ సాబ్, హోటల్ సుఖ్‌సాగర్, జంబో కింగ్ బర్గర్స్, రత్నదీప్ రిటైల్ స్టోర్, సోమాజిగూడ కృతుంగ రెస్టారెంట్, సోమాజిగూడ రెస్ట్ ఓ బార్.



నేషనల్ హైవేపై ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డుపై భారీగా నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

వాగు కాదిది.. వర్షపునీరు

- చినుకుపడితే తటాకాన్ని తలపించేలా మూసాపేట మెట్రోస్టేషన్ పరిసర ప్రాంతాలు
- కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. రాకపోకలకు తీవ్ర ఆటంకం
- రూ. 35 లక్షల వ్యయంతో శాశ్వత పరిష్కారానికి అధికారుల చర్యలు

మూసాపేట: అక్కడ వర్షం పడితేచాలు వాగులను తలపించేలా ఆ రోడ్డు మారడంతో ఆ ప్రాంతం మీదుగా వెళ్లాలంటే ప్రయాణికుల్లో వెనుల్లో వణుకుపుడుతోంది. ప్రతి వర్షాకాలంలో ఆ ప్రాంత పరిసరాలు చిన్నపాటి చెరువును తలపించేలా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. దీంతో వర్షం పడిన సమయంలో రోడ్డుపై నిలిచిన మోకాళ్లోతు నీటిలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అటూ ఇటూ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతూ ఆ వర్షపు నీరు వెళ్లిపోవటానికి సుమారు మూడు, నాలుగు గంటల సమయం పడుతోంది. కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో ఇదే తంతుగా మారుతోంది. ఈ విషయంపై ఎన్నిసార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవటం లేదు. కూకట్‌పల్లి ఆర్‌టిసి డిపో నుంచి మూసాపేట మెట్రో స్టేషన్ వరకు వర్షపు నీరంతా జాతీయ రహదారిపై చెరువును తలపించేలా వరద ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. అయితే ఇన్నాళ్లకు అక్కడ నీరు నిల్వ ఉండకుండా ఎంత వర్షం వచ్చినా ప్రవహించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఈ వర్షాకాలంలోనైనా సమస్య తీరుతుందా అని స్థానిక ప్రజలు, వాహనదారులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఇక్కడ పనులు ప్రారంభమై ముగింపుదశకు చేరుకున్నాయి.

అసలు సమస్య...

కూకట్‌పల్లి రంగనాయక చెరువు అలుగు నీరు, హబీబ్‌నగర్, శక్తినగర్, చెరువు కింది ప్రాంతం, ఆంజనేయనగర్, పవర్‌నగర్, ప్రగతి నగర్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు వసుంధర ఆసుపత్రి వెనుక ఉన్న నాలా నుంచి ప్రవహిస్తూ ఆర్‌టిసి డిపో ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ పక్కన గల ఓపెన్ నాలా నుంచి శ్మశానం మధ్య నుంచి హుస్సేన్‌సాగర్‌కు వెళ్లే నాలాలోకి కలుస్తాయి. అయితే చెరువు అలుగునీరు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ నీరు, వర్షపునీటితో కలిసి ప్రవహించటంతో జాతీయ రహదారి రోడ్డుకు అటువైపుగా నీరు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవటంతో రోడ్డుపైనే నిలిచిపోతోంది. అంతేకాకుండా కాలక్రమేణా మూసాపేట మెట్రో స్టేషన్ నిర్మాణం జరిగినప్పుడు ఇక్కడ ఉన్న కొన్ని పైపులు మూసుకుపోయాయి. దీంతో వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు మార్గం లేకపోవటంతో మరింత ఆటంకం ఏర్పడింది. నీరు నిలిచిపోవటంతో డివైడర్ మధ్యలో చిన్నచిన్న పైపులు వేసి నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నా కానీ ఫలితం లేదు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా చినుకు పడితే భయపడుతూ వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.



వర్షపు నీటితో వాగును తలపిస్తున్న రోడ్డు (ఫైల్)

రూ.35 లక్షల వ్యయంతో నాలా పనులు ప్రారంభం...

జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు సుమారు రూ. 35 లక్షల వ్యయంతో ఈ నాలా పనులు ప్రారంభమయ్యాయి. ఎస్ఈ చిన్నారెడ్డి, ఇఇ సత్యనారాయణ, డిఇ ఆనంద్, ఏఈ శ్రీనివాస్‌ల సమక్షంలో ఈ పనులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని రోడ్డుపై వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పెట్రోల్ బంక్, ఆర్‌టిసి డిపో, స్మశానవాటిక సమీపంలో ఉన్న పైపులైన్‌లను ముందుగా గుర్తించారు. అసలు వర్షపు నీరు వెళ్లకుండా ఉండటానికి ప్రధాన కారణం పైపుల్లో పూర్తిగా మట్టి పేరుకుపోయి ఉండటంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుండేది. అన్ని పైపుల్లో మట్టిని తొలగించారు. సుమారు 30 ట్రాక్టర్ల మట్టిని తొలగించినట్లు తెలిసింది. పెట్రోల్ బంక్ సమీపం వద్ద నాలా జంక్షన్ ఉంది. ఆ జంక్షన్ నుంచి మెకానిక్ షాపుల ముందుగా మెట్రో స్టేషన్ వరకు రెండు పైపులు 6 అడుగుల ఎత్తులో భారీగా ఉన్నాయి. వీటిలో ఉన్న మట్టిని పూర్తిగా తొలగించారు. 6 క్యాచ్‌పిట్‌లను ఏర్పాటు చేసి గ్రిల్స్ బిగించారు. ఈదారి చాలా ప్రమాదకరంగా 6 అడుగుల ఎత్తులో ఉంటుంది. మరో లైన్ జంక్షన్‌కు ఎదురుగా ఆర్‌టిసి డిపో వైపు వెళుతుంది. ఇక్కడ 3 అడుగుల పైపులైన్‌లు 4 ఉంటాయి. డివైడర్ మధ్యలో కూడా పైపులను తొలగించి అక్కడ మట్టిని తొలగించి గ్రిల్స్‌ను ఏర్పాటు చేశారు. ఆర్‌టిసి డిపో వద్ద కూడా 2 ప్రాంతాల్లో ఫుట్‌పాత్ కింద నాలా పైపులు ఉండటంతో ఫుట్‌పాత్‌ను తొలగించి మరమ్మతులు చేపట్టారు. ఆర్‌టిసి డిపో ఎదురు నుంచి మరో పైపులైన్ శ్మశాన వాటిక వైపు వేసి మెట్రో స్టేషన్ కిందుగా ఉన్న కల్వర్ట్‌లో కలిపారు. ప్రస్తుతం ఈ జంక్షన్ నుంచి 3 దారుల్లో ఎప్పటికప్పుడు నీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఒకవైపు 6 అడుగుల పైపులైన్ 2, మరో వైపు 3 అడుగుల పైపులైన్‌లు 4, మరో లైన్ 3 అడుగుల పైపులైన్‌లు 2 ఏర్పాటు చేశారు. దీంతో ఎంత పెద్ద వర్షం వచ్చినా చుక్క నీరు మెట్రో స్టేషన్ కింద, డిపో వద్ద ఆగకుండా నాలాలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నారు. దాదాపు పనులు పూర్తయ్యాయని నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులు జరుగుతున్నాయని తెలిపారు.



నీరు సాఫీగా వెళ్లటానికి అధికారులు చేపడుతున్న పనులు (ఫైల్)

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మూసాపేట: కేపీహెచ్‌బీ 11 కెవి ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శంకర్ తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి 1 గంట వరకు కేపీహెచ్‌బీ 7వ ఫేజ్ సమీపంలో, మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు అంకుర ఆసుపత్రి సమీపంలో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆర్‌టిఓ కార్యాలయం, కేపీహెచ్‌బీ 4వ ఫేజ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

రైతు బజార్‌లో కూరగాయల ధరలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి రైతు బజార్‌లో కూరగాయల ధరలు శుక్రవారం 1కిలోకి ఈ విధంగా ఉన్నాయి. టమాటా రూ.27, వంకాయ రూ.23, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.50, బజ్జిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ. 35, క్యాబేజి రూ. 17, బీన్స్ రూ. 125, క్యారెట్ రూ. 40, గోబిపువ్వు రూ. 18, దొండకాయ రూ. 31, చిక్కుడుకాయ రూ. 70, గోరుచిక్కుడు రూ. 40, బీట్‌రూట్ రూ. 19, క్యాప్సికం రూ. 45, ఆలుగడ్డ రూ. 31, కీరా రూ. 18, దోసకాయ రూ. 23, సొరకాయ రూ. 11, పొట్లకాయ రూ. 18, కంద రూ. 75, ఉల్లిపొరక రూ. 55, ఉల్లిగడ్డ రూ. 24, మామిడికాయ రూ. 10 నుంచి రూ. 15, అరటికాయ రూ. 8 నుంచి 9, చామగడ్డ రూ. 40, ముల్లంగి రూ. 4 నుంచి 5, చిలగడ దుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 35, నిమ్మకాయలు రూ. 65 నుంచి రూ. 75, మునగకాయలు రూ. 4 నుంచి 5, బొప్పాయి రూ. 40, పుట్టగొడుగులు రూ. 40, ఎండుమిర్చి రూ. 220, అల్లం రూ. 180, వెల్లుల్లి రూ. 240, చింతపండు రూ. 120, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 40, వేరుశెనగ నూనె రూ. 165, పామాయిల్ నూనె రూ.97.లుగా ఉన్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

సీఆర్ ఫౌండేషన్‌కు రూ.5 లక్షల విరాళం

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌కు ప్రముఖ వాణిజ్య సంస్థ జన చైతన్య హౌసింగ్ అధినేత మాదల సుధాకర్ శుక్రవారం రూ.5 లక్షల విరాళంను డాక్టర్ నారాయణకు అందజేశారు.ఆయన మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రోగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సీఆర్ పాలి క్లినిక్, డయాగ్నొస్టిక్ సెంటర్ల నిర్వహణకు వినియోగించవలసిందిగా కోరారు. అనంతరం సీఆర్ ఫౌండేషన్‌లో వృద్ధాశ్రమంను సందర్శించారు.

బీసీ కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న భేరి రాంచందర్‌యాదవ్, సభ్యులు

శేరిలింగంపల్లి: బీసీల కుల గణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భేరి రాంచందర్‌యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లిలో బీసీ ఐక్యవేదిక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌యాదవ్ మాట్లాడుతూ బీసీ కులాల జనగణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా రాష్ట్రంలోని సర్పంచ్, వార్డు, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, మున్సిపల్ వార్డు కౌన్సిలర్, చైర్మన్ తదితర పోస్టుల్లో బీసీలకు 50 శాతం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు నర్సింగ్ ముదిరాజ్, యువజన విభాగం అధ్యక్షులు కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ చాలా కీలకం



నానక్‌రాంగూడలో సోషల్ ఇంటెలిజెన్స్ బూత్‌క్యాంపులో పాల్గొన్న వారు

సీనియర్ భారత దౌత్యవేత్త డాక్టర్ దీపక్ ఓహ్రా

రాయదుర్గం: కమ్యూనికేషన్ అనేది కీలకపాత్ర పోషిస్తుందని భారత దౌత్యవేత్త డాక్టర్ దీపక్ ఓహ్రా అన్నారు. నానక్‌రాంగూడలో సోషల్ ఇంటెలిజెన్స్ బూత్‌క్యాంప్‌ను క్యాటలిస్ట్ సంస్థ శుక్రవారం ప్రారంభించింది. మూడు రోజులపాటు సాగే ఈ కార్యక్రమం 21 సెషన్‌లుగా ఉంటుంది. 15 మంది వక్తలు పాల్గొంటున్నారు. మొదటిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరైన డాక్టర్ దీపక్ ఓహ్రా మాట్లాడుతూ భారతదేశం భారత్‌గా మారే సమయంలో తన గమ్యానికి నమ్మకంగా ముందుకు సాగుతున్నప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. సాధికార కమ్యూనికేషన్ మొక్క లక్ష్యం అందరిలోనూ విశ్వాసాన్ని నెలకొల్పడం, సందేశాన్ని నమ్మదగినదిగా రూపొందించి వారి ముందుంచడం అవసరమన్నారు. అనంతరం అనందితా ఎం. సిన్హా, హర్షవర్ధన్ ఎర్రా, మేఘన తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో శంషాబాద్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ప్రతినిధులు, విశాఖపట్నం చైర్మన్ వై.వరప్రసాద్‌రెడ్డి, సైబరాబాద్ డీసీపీ నరసింహ పాల్గొన్నారు.

సమన్వయ లోపం... వాహనదారులకు శాపం

- అధికారులకు సమన్వయం లేదు..
- వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు

రంగారెడ్డినగర్: ఇరు శాఖల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, రంగారెడ్డినగర్‌లను ఆనుకుని గాంధీనగర్ పారిశ్రామికవాడ విస్తరించింది. కొంత భాగం ఐలా పరిధిలో.. మరికొంత భాగం జీహెచ్‌ఎంసీ పరిధిలోకి వస్తుండటంతో స్థానికంగా అభివృద్ధి విషయంలో ఇరు శాఖల అధికారులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా గాంధీనగర్ నుంచి సంజయ్‌గాంధీనగర్ మీదుగా జగద్గిరిగుట్టకు వెళ్లే రోడ్డు గతుకులమయంగా మారింది. వర్షం పడితే రోడ్లపై వరదనీరు చేరి మరింత అధ్వానంగా మారుతోంది. ఈ రోడ్డుపై ఇసుక మేటలు వేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు కల్పించుకుని రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి రాకపోకలకు అనువుగా మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్లే గ్రౌండ్‌లో సమస్యలను పరిష్కరించాలి

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీ ఆసియాలోని అతి పెద్ద కాలనీలో ఒకటి. ఈ కాలనీలోని 7వ ఫేస్‌లో జీహెచ్‌యంసి ఆధ్వర్యంలో క్రీడాకారులకు వివిధ ఆటల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ గ్రౌండ్‌లో సుమారు 200 మంది బాలబాలికలు వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నిస్, క్రికెట్, కబడ్డీ వంటి పలు రకాల ఆటల్లో శిక్షణ పొందుతున్నారు. అయితే ఈ ప్లే గ్రౌండ్‌లో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జనరల్ సెక్రటరి బి. అంజిబాబు జీహెచ్‌ఎంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. బాస్కెట్ బాల్ కోర్టుకు యాక్రిలిక్ సింథటిక్ ఫోర్ వేయాలని వినతి పత్రంలో కోరారు. కొత్త బాస్కెట్ బాల్ ప్రాంతానికి గ్లాస్ బోర్డులను 25 మి.మీ. ఫిక్సింగ్‌తో చేయాలన్నారు. ప్లే గ్రౌండ్‌లో 15 బెంచీలను ఏర్పాటు చేయాలని, అలాగే కాంపౌండ్ వాల్‌కు పెయింటింగ్ వేయాలన్నారు. అదే విధంగా వాలీబాల్, కబడ్డీ, షటిల్, టెన్నిస్ ప్రాంతంలో గ్రావెల్ వేయాలని వినతి పత్రంలో ఆయన కోరారు.


అలరించిన నిథమ్ 'ఫుల్ మూన్ ఫెస్ట్'

రాయదుర్గం: కేరింతలు, ఈలలు, చప్పట్లతో గచ్చిబౌలిలోని 'నిథమ్' క్యాంపస్ దద్దరిల్లింది. నిథమ్ క్యాంపస్‌లోని హంపీ థియేటర్‌లో గురువారం రాత్రి 'నిథమ్ ఫుల్‌మూన్ ఫెస్ట్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. నిథమ్‌లోని బీబీఏ 6వ సెమ్ విద్యార్థుల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని జరిపారు. లైవ్ బ్యాండ్ ఆర్టిస్ట్ తార, డీజే రోహిత్‌ల పాటలను విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు ఆస్వాదించారు. సంగీతానికి అనుగుణంగా నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

నిజాంపేట్: బాచుపల్లి ఎస్ఎల్‌జీ ఆస్పత్రి సౌజన్యంతో ఈనెల 26న నిజాంపేట్ బండారి లేఅవుట్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. బండారి లేఅవుట్ కమిటీహాల్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగే శిబిరంలో జనరల్ సర్జన్, కార్డియాలజీ, పాల్మనాలజీ, పిల్లలు, స్త్రీ సంబంధిత వ్యాధుల వైద్యులు పరీక్షలు చేస్తారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

'వడ్డీ లేని రుణాలు రావడం లేదు'



సమావేశమైన డ్వాక్రా గ్రూపు మహిళలు

కుత్బుల్లాపూర్: తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఉమా కోరారు. కుత్బుల్లాపూర్ టౌన్ లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి ఆసియా బేగం అధ్యక్షతన శుక్రవారం సమావేశానికి ఉమా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరేళ్లుగా చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూ వచ్చే నెల 19వ తేదీన టీఎల్ఎఫ్ కుత్బుల్లాపూర్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవా లని నిర్ణయించారు. 2015 నుంచి ఇప్పటి వరకు వడ్డీ లేని రు ణాలు రావడంలేదని వారు బ్యాంక్ మేనేజర్‌కు తెలిపారు. మొత్తం టీఎల్ఎఫ్ 72 గ్రూపులు ఉండగా వాటిలో కొంత మందికి రుణాలు రాకపోవడంతో దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి తిరిగి రుణాలు పొందాలని మహిళలు తీర్మానం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో వడ్డీలేని రుణాలు అందించాలని కోరారు.